## క్లుప్తంగా

### బాగా చదివితేనే బంగారు భవిష్యత్తు



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాళీమందిర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 7వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు బాగా చదువుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింలు, సంజీవ, పార్వతీదేవి, భాగ్యలక్ష్మి, ప్రియరంజిని, సుజాత, శ్రీవాణి, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాణీరవి

శంషాబాద్ రూరల్: రషీద్‌గూడలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను సర్పంచ్ రాణీరవి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రూ.7.30 లక్షల పంచాయతీ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, గ్రామస్తులు యాదయ్య, ముక్తార్, సుభాన్, సాధక్, సలీం తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కేపీఆర్ కాలనీలో ఒరిగిన విద్యుత్ స్తంభం

మణికొండ: విద్యుత్ ప్రమాదాలను ముందుగానే గుర్తించి వాటిని నివారించాల్సిన అధికారులు పదుల సార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని కేపీఆర్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కేపీఆర్ కాలనీలో ఓ విద్యుత్ స్తంభం పూర్తిగా వంగిపోయింది. అసలే ఈదులు గాలులు వీస్తుండటంతో ఆ సమయంలో పడిపోయి అటుగా వెళ్తున్న వారికి ప్రమాదం జరిగే సూచనలు ఉన్నాయని కాలనీ వాసులు పేర్కొన్నారు. అదే విషయాన్ని విద్యుత్ ఏఈ, లైన్‌మెన్‌లకు చెప్పినా పట్టించుకోవటం లేదని వారు వాపోతున్నారు. ఇకనైనా విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి దాని స్థలంలో మరో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### 'ఇఫ్తార్ విందులకు హైదరాబాద్ పెట్టింది పేరు'

గోల్కొండ: హైదరాబాద్ నగరం మతసామరస్యానికి పెట్టింది పేరు అని, ఇఫ్తార్ విందులకు మన నగరం మారుపేరుగా నిలిచిందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం గోల్కొండ జీఎంకే బిల్డర్స్ అండ్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ గులాం మొయినుద్దీన్ ఖాన్ పాషాభాయ్ ఆధ్వర్యంలో గోల్కొండ మోతీ దర్వాజ వద్ద జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం అంటే ఇఫ్తార్ విందులేనన్న అభిప్రాయం ప్రజలలో నెలకొని ఉందని ఆయన అన్నారు. ఇఫ్తార్ విందుల్లో తమ స్నేహితులు, బంధువులనే కాకుండా స్థానిక పేదలను కూడా ఆహ్వానించాలని, దీని వల్ల పేద, ధనిక వర్గాల మధ్య ఉన్న భావం తొలగిపోతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీఎంకే బిల్డర్స్ అండ్ డెవలపర్స్ డైరెక్టర్ షకీల్ అలీఖాన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు బదర్ ఉద్దీన్, వజీ ఉజ్జమా, హారూన్ ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

### శుభాకాంక్షలు



రాయదుర్గం: మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని భారతీయ జనతా యువమోర్చా తెలంగాణ రాష్ట్ర కోశాధికారి రఘునాథ్‌యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలంపాటు కాంగ్రెస్‌పార్టీలో ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి ఇటీవల బీజేపీలో చేరిన సందర్భంగా ఆయనను కలిసి నట్లు తెలిపారు.

# స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే

రాజేంద్రనగర్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంత్యుత్సవాలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు వీ.హెచ్.హన్మంత్‌రావు, బీఆర్ఎస్ యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కార్పొరేటర్లు అర్చనజయప్రకాష్, సంగీతగౌరీశంకర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముద్దగౌనీ మల్లికార్జున్‌గౌడ్, శివముదిరాజ్, కృష్ణమాచారి, పోతరాజుయాదయ్య, కొల్లమీది యాదయ్య, డి.సత్యనారాయణ, రజనీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. హైదర్‌గూడలో జరిగిన కార్యక్రమంలో వై.శ్రీధర్, మల్లారెడ్డి, కొమురయ్య, అడికే రాజు, రాజశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. బుద్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో సాయిమాలిక్, అత్తాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముద్దగౌనీ భాస్కర్‌గౌడ్, హైదర్‌గూడలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్ రావు తదితరులు హాజరై పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి..**

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

**సమసమాజానికి జ్యోతిరావు పూలే కృషి..**

మణికొండ: సమసమాజ స్థాపనకు పూలే కృషి చేశారని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం పూలే జయంతిని పురస్కరించుకుని వట్టినాగులపల్లి, నార్సింగిలో వారు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బీరప్ప, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్. భిక్షపతియాదవ్, నాయకులు బుచ్చిరెడ్డి, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రజనీకాంత్ తదితరులు

**బండ్లగూడలో..**

బండ్లగూడ: పూలే జయంతి కార్యక్రమాన్ని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఓంనగర్ కాలనీలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వట్టినాగులపల్లిలో.. మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి



నార్సింగిలో.. బీజేపీ నాయకులు



ఓంనగర్‌లో..



నివాళులర్పిస్తున్న వీ.హెచ్.హన్మంత్‌రావు తదితరులు



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ తదితరులు

రాజేంద్రనగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జీహెచ్ఎంసీ, ఇతర అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజల సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నెలకొన్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు తమవంతు బాధ్యతగా పని చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ ఔట్‌పోస్టు ఎస్సై శ్రీకాంత్, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ జావేద్, జీహెచ్ఎంసీ ఎస్ఎస్ శేఖర్, వినయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎంటమాలజీ సిబ్బంది లక్ష్మీనారాయణ, లైన్‌మెన్ అఖిలేష్, వెంకటేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ పోచమ్మ ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూలు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా అలకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, కుంకుమార్చనలు, హోమం ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోని నైవేద్యాలు సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. ఈ పూజల్లో తిరునగర్ గోపాల్, వర్కాల చందు, తిరందాస్ నరేందర్, కోటా శ్యామ్, కైరంకొండ శంకర్, కాల రాజు, పద్మమ్మ, రాధిక, వెంకటమ్మ, యాదయ్య, లక్ష్మమ్మ, ఇందిరా, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# ప్రజలంతా కలిసిమెలిసి పండగలను జరుపుకోవాలి

బండ్లగూడ: ప్రజలంతా కలిసిమెలిసి పండగలను జరుపుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో అల్ బిలాల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ఒకరి పండగలను మరొకరు గౌరవించుకుంటూ అందరూ ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు పాపయ్యయాదవ్, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, సుమన్‌గౌడ్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

# లేబర్‌కార్డును తప్పనిసరిగా తీసుకోవాలి

శంషాబాద్ రూరల్: కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడంతో పాటు లేబర్‌కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సుల్తాన్‌పల్లి శివారులో ఉన్న ఇటుక బట్టీల్లోని కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన జడ్జి మాట్లాడుతూ.. కార్మికులకు న్యాయ సంబంధమైన విషయాలపై అవగాహన కల్పించడంతో పాటు ఎలాంటి సమస్యలు ఎదురైనా వారికి తగు సహాయం చేసేందుకు జిల్లా న్యాయాధికారి సంస్థ, పారా లీగల్ వలంటీర్లు ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, లేబర్ ఆఫీసర్ వాల్యానాయక్, వైద్యురాలు డాక్టర్ దివ్య, పారా లీగల్ వలంటీర్లు బాల్‌రెడ్డి, సంజీవ, శ్రీలత, శంకర్, శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

### నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నియమనిబంధనలను తప్పనిసరిగా పాటించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నివాస ప్రాంతాల్లో గోదాములు, పరిశ్రమలు తదితర వాటిని పూర్తిగా నిషేధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్క్రాప్ గోడౌన్ (వేస్ట్ పేపర్, ప్లాస్టిక్), పెయింట్, చమురు గోడౌన్, మండే స్వభావం గల, చమురు నిల్వ చేయి గోడౌన్, పేలుడు పదార్థాల నిల్వ గోడౌన్, కలప, రంపపు కోత యంత్రాలు, వేర్ హౌస్ గోడౌన్, గోనె సంచి నిల్వ గోడౌన్, రసాయన పరిశ్రమలు, చమురు ప్రాసెసింగ్, రిసైక్లింగ్ పరిశ్రమలు, ఎయిర్ కూలర్ తయారీ, నిల్వ పరిశ్రమలు, శాస్త్రచికిత్స, వైద్య ప్రయోగాత్మక పదార్థాల ఉత్పత్తుల పరిశ్రమలు తదితర వాటిని నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేయవద్దు అన్నారు. వాణిజ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వీటికి తప్పనిసరిగా భద్రత ప్రమాణాలను, స్మోక్ డిటెక్టర్ ఉండాలన్నారు. నిబంధనలు పాటించకుంటే వ్యాపార లైసెన్సన రద్దు చేస్తూ వ్యాపార సంస్థలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: వేసవి కాలంలో బాటసారుల దాహార్తి తీర్చటం ఎంతో పుణ్యకార్యక్రమమని, అలాంటి సంస్థలు, వ్యక్తులకు ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చౌరస్తాలో అరుణాచల శివ సేవా సత్సంగం వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి కూడలిలో ఇలాంటి చలివేంద్రాలను ఏర్పాటు చేయటంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీరప్ప, కో ఆప్షన్ సభ్యుడు సిద్ధప్ప, యువమోర్చా అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, సత్సంగం నాయకుడు బద్రీనాథ్ పాల్గొన్నారు.

### అదుపుతప్పి టిప్పర్ బోల్తా

రాజేంద్రనగర్: వేగంగా దూసుకువచ్చిన భారీ టిప్పర్ వాహనం అదుపుతప్పి ఓఆర్ఆర్‌పై నుంచి సర్వీస్ రోడ్డుపై పడింది. ఈ ఘటనలో స్వల్ప గాయాలతో డ్రైవర్ బయటపడ్డాడు. రాజేంద్రనగర్ పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం రామోజీఫిల్మిసిటీ ప్రాంతం నుంచి 34 టన్నుల డస్ట్‌ను తీసుకోని డ్రైవర్ లక్ష్మణ్ గచ్చిబౌలి వైపు వెళ్తున్నాడు. హిమాయత్‌సాగర్ ప్రాంతం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి ఓఆర్ఆర్ ప్రహరీని ఢీకొట్టింది. భారీ లోడ్‌తో ఉన్న వాహనం కావడంతో ప్రహరీని దాటి సర్వీస్ రోడ్డుపై పడింది. ఈ సమయంలో అటుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో బయటకు తీశారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మణికొండ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మణికొండ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో సోమవారం రాత్రి జరుగుతున్న బీటీ రోడ్డు పనులను కౌన్సిలర్ వసంతరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల అలకాపూర్ టౌన్‌షిప్‌లో వేసిన పలు బీటీ రోడ్లు అప్పుడే పాడయిపోతున్నాయన్నారు. కాంట్రాక్టర్‌లు తక్కువ ధరలకు టెండర్‌లను దక్కించుకుని నాణ్యత లేకుండా పనులు చేస్తున్నారన్నారు. అధికారులు పనులు జరుగుతున్న చోట ఉండి చేయించాల్సి ఉండగా అలాంటి నియమాలు మణికొండలో అమలుకావటం లేదన్నారు. ఇకనైనా అధికారులు పనులను నాణ్యతతో చేయించాలన్నారు.



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

# విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజేంద్రనగర్: అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను నేటి తరానికి వివరించాలని శివరాంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ వెల్లడించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకోని మంగళవారం పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటం చిత్రించే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అంబేడ్కర్ చిత్రాన్ని అందంగా గీశారు. ఉత్తమ చిత్రాలకు అంబేడ్కర్ జయంతి సందర్భంగా బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూపాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

### అన్నదానం




అన్నదానం చేస్తున్న దృశ్యం

శంషాబాద్: ఊట్‌పల్లి గ్రామానికి చెందిన సామాజిక వేత్త మహేష్‌గౌడ్ రాధిక దంపతులు ప్రభుత్వాసుపత్రుల వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. రోగులతో పాటు వారికి సహాయకులుగా ఉండేవారు ఆహారానికి ఇబ్బందులు పడకుండా ఈ సేవలు అందిస్తున్నట్లు వారు తెలిపారు.

# సత్తాచాటిన శ్రీ చైతన్య విద్యార్థులు



సర్టిఫికెట్లు, బహుమతులో శ్రీ చైతన్య విద్యార్థులు

రాజేంద్రనగర్: జాతీయ స్థాయి ఒలింపియాడ్ ఫలితాల్లో హైదర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఐఎస్‌టీఎస్ఓ ఒలింపియాడ్ ఫలితాల్లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 237 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ ఎస్.కె.దాస్ హాజరై ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి బహుమతి నుంచి 5వ బహుమతి వరకు విద్యార్థులు గెలుచుకున్నారన్నారు. 35 మంది విద్యార్థులకు కన్సోలేషన్, 197 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, మెరిట సర్టిఫికెట్స్ అందాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డీన్ పుల్లారావు, కో ఆర్డినేటర్ రవి, డీన్ నరేష్, యాదగిరి, నీలిమ, సరళ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు దొంగల అరెస్టు

రాజేంద్రనగర్: పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించడంతో పాటు రాత్రి సమయంలో ఆటో డ్రైవర్లను బెదిరించి నగదు, సెల్‌ఫోన్‌లను దోచుకుంటుంటున్న ముగ్గురు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ముగ్గురిలో ఇద్దరు పాత నేరస్తులు కాగా మరోకరు నిందితుల స్నేహితుడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నూమా తీగలకుంటకు చెందిన జుబేర్‌ఖాన్(22) బేకరీలో పని చేస్తున్నాడు. ఇతడికి సంతోష్‌నగర్‌కు చెందిన సయ్యద్ అర్బాజ్(22) స్నేహితుడు, వీరిపై రాజేంద్రనగర్, సుల్తాన్ నగర్, ఆసీఫ్‌నగర్‌లలో ఐదు కేసులు నమోదయ్యాయి. గతంలో ఇరువురు జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. పహాడీషరీఫ్‌కు చెందిన షేక్ జలీల్(22)తో పరిచయం అయ్యారు. ఈనెల మొదటి వారంలో ముగ్గురు కలిసి పీడీపీ చౌరస్తా ప్రాంతంలో అర్ధరాత్రి వేళ ఆటో డ్రైవర్‌ను అడ్డగించి సెల్‌ఫోన్‌తో పాటు రూ. 13 వేల నగదును దోచుకెళ్లారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ముగ్గురు నిందితులను పట్టుకోని రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్లాస్టిక్ గోదాములో అగ్నిప్రమాదం

శంషాబాద్: రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలోని ప్లాస్టిక్ గోదాములో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. తమిళనాడు హోటల్ సమీపంలో ఉన్న గోదాములో ప్రమాదవశాత్తు మంటలంటుకున్నాయి. గోదాములో ఉన్న ప్లాస్టిక్ అంతా అగ్నికి ఆహుతైంది. మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో స్థానికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పివేశారు. దాణా తయారికి కోసం నిల్వచేసిన ప్లాస్టిక్ పెద్ద ఎత్తున దగ్ధం కావడంతో పాటు అందులో ఉన్న కొన్ని పనిముట్లు కూడా కాలిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



### 'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

చార్మినార్: ఏబీవీపీ కోఠి జిల్లా, చార్మినార్ సిటీ కళాశాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత, అవినీతి, విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని హైకోర్టు చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సబావట్ కల్యాణ్, కళాశాల అధ్యక్షుడు దిలీప్ మాట్లాడుతూ.. 18 లక్షల మంది విద్యార్థుల ఎదురు చూపులు అయిన 500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సజన్‌తో పాటు రాహుల్, శ్రీకాంత్, యశ్వంత్, రమేష్, సందీప్, తరుణ్, అరవింద్, రుసేంద్ర, కార్తీక్, లక్ష్మణ్, అమరేందర్, భావ్య, అనిత, శ్రావణి పాల్గొన్నారు.